
ప్రేమికులకు ప్రేమతో..

అల్వాల్: ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్వాల్‌కు చెందిన పూన ప్రదీప్ కుమార్ ప్రేమికుల చిహ్నాన్ని చాక్‌పీస్, బియ్యపు గింజ, పెన్సిల్ మొన, రావిఆకు, చింత గింజలపై చిత్రించి ప్రేమికులకు శుభాకాంక్షలు తెలిపారు.



'చిన్న కొడుకు ఇబ్బంది పెడుతున్నాడు'

- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ సైనిక ఉద్యోగి
- స్పందించిన రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్



సత్యనారాయణ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

అల్వాల్: మహిళలు, వయోవృద్ధుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న 99 ఏళ్ల మాజీ సైనిక ఉద్యోగి ఎస్.సత్యనారాయణ తన చిన్న కొడుకుతో ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ చాంబర్ నుంచి తానే స్వయంగా వచ్చి మాజీ సైనిక ఉద్యోగి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళలు, వృద్ధుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు స్వయంగా రాలేని బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ ఫోన్: 94906 17111కు ఫిర్యాదు చేస్తే బాధితులకు సత్వరమే న్యాయం చేస్తామన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ హెచ్ఎంటీనగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. హెచ్ఎంటీ నగర్ వీధి నంబర్-1 నుంచి 12 వరకు, నాచారం ప్రధాన రహదారి, బాపూజీనగర్, హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీ, మంగపురం వెంకటేశ్వరస్వామి టెంపుల్ బ్యాక్‌సైడ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదని తెలిపారు.

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్, పలు ఫీడర్ల పరిధిలో మంగళవారం కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ అర్చన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 1 గంట వరకు, 11 కేవీ మజీద్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదని తెలిపారు.

నేడు సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

కుషాయిగూడ: చక్రిపురం చౌరస్తాలో గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. వేడుకల ఏర్పాట్లను సోమవారం ఆమె పరిశీలించి వెళ్లారు. గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



మల్కాజిగిరి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. డివిజన్ పరిధిలోని విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీలో రూ.52 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ పైపులైన్, తాగునీటి పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కాలనీవాసులు సత్య గురుదేవరావు, నాగరాజ్, నాయక్, ఫణి శర్మ, నారాయణరావు, వసంత్, రాంచందర్ పాల్గొన్నారు.

రయ్యిరయ్యిమంటూ..

అభివృద్ధిలో దూసుకుపోతున్న రామంతాపూర్

- హామీల్లో 60% పూర్తి 100% దిశగా అడుగులు
- దశలవారీగా అభివృద్ధి పనులు
- ఇప్పటివరకు రూ.15 కోట్లు ఖర్చు
- రామంతాపూర్ కార్పొరేటర్ రెండేళ్ల పాలన



అంబేడ్కర్ సేవా సంఘం శ్రీనగర్‌కాలనీ కమ్యూనిటీ హాలు వరకు రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులు

రామంతాపూర్: రామంతాపూర్ డివిజన్‌కు బీజేపీ కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తి చేసుకున్న బండారు శ్రీవాణివెంకట్రావు డివిజన్‌లోని ముఖ్యమైన సమస్యలైన భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. డివిజన్‌లో జీహెచ్ఎంసీ, ఎమ్మెల్యే, పంచాయతీరాజ్ నిధులతో భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, కల్వర్టులు, వీధి దీపాలు, చిన్న చెరువుకు ఫెన్సింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు.

దశలవారీగా హామీలు పూర్తి..

ఇచ్చిన హామీల మేరకు డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్, ఓల్డ్ రామంతాపూర్, కేసీఆర్‌నగర్, వివేక్‌నగర్, రామ్‌శంకర్‌నగర్‌లలో సీసీ రోడ్లు పూర్తి చేశారు. అదేవిధంగా ఓల్డ్‌రామంతాపూర్, సాయికృష్ణ కాలనీ, వివేక్‌నగర్, బాలకృష్ణనగర్, వాసవీనగర్, కామాక్షిపురంలో భూగర్భ డ్రైనేజీలను నూతనంగా నిర్మించి మురుగు సాఫీగా వెళ్లడానికి ట్రంక్‌లైన్ ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో తాగునీటి సౌకర్యం లేని సాయికృష్ణనగర్, బాలకృష్ణనగర్, కురుమనగర్, సవేరా కాలనీ తదితర ప్రాంతాల్లో నూతనంగా పైపులైన్ ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఇచ్చిన హామీల్లో 60 శాతం పూర్తి



రెండేళ్ల క్రితం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు 60 శాతం పూర్తి చేశాం. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలను జీహెచ్ఎంసీకి పంపించాం. త్వరలోనే డీమార్ట్ నుంచి ఓల్డ్ రామంతాపూర్ వరకు ప్రతిపాదిత రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. అదేవిధంగా డివిజన్‌లో ఉన్న రెండు శ్మశానవాటికల ఆధునీకరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నాం. పలు పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నా. డివిజన్‌లో ఎక్కడా లేని విధంగా ప్రతి వీధిలో, చౌరస్తాలో, చిన్న చెరువు గ్రౌండ్‌లో హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేశా. ప్రజల సూచనలు, సలహాలు, సహకారంతో రాజకీయాలకు తావులేకుండా డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నా.

– బండారు శ్రీవాణివెంకట్రావు, కార్పొరేటర్, రామంతాపూర్.

పెండింగ్ పనులు..

డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి డీ మార్ట్ నుంచి ఏడీఆర్ఎం ఆస్పత్రి వరకు అదేవిధంగా ప్రతిపాదిత రోడ్డు నిర్మాణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు అందుబాటులోకి రాకపోవడంతో ఈ పనులు పెండింగ్‌లో పడినట్లు సమాచారం. అదేవిధంగా డివిజన్‌లో ఉన్న శ్మశానవాటికలో అరకొర సౌకర్యాలు ఉన్నాయి. వీటిని ఆధునీకరించే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చిన్న చెరువు స్థలానికి పూర్తిస్థాయి ఫెన్సింగ్ పనులు చేపట్టకపోవడంతో చెరువు కాలుష్యంతో నిండిపోవడమే కాకుండా చెరువు గ్రౌండ్‌లో పెద్దఎత్తున వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారిపోయింది.

కన్నుల పండువగా శివ పడిపూజ



శివస్వాములతో కలిసి పడి ముట్టిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: శివ స్వాములు నిర్వహించిన శివ మహా పడిపూజ కన్నుల పండువగా జరిగింది. చర్లపల్లి, గాంధీనగర్ బాలకృష్ణ స్వామి ఇంట్లో సోమవారం జరిగిన పడిపూజలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా శివస్వాముల భజనలు, శివనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భిక్ష తాంబూళం అందజేసి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, విద్యాసాగర్, మురళీపంతులు, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన కైలాసగిరి మల్లికార్జున స్వామి ఆలయం

కుషాయిగూడ: భక్తుల కొంగు బంగారంలా కొలిచే కంచి కామకోటి పీఠం కైలాసగిరి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం నుంచి 23వ వార్షికోత్సవ శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి తెలిపారు. ఈ నెల 19 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుడు జలగం వెంకటేష్ ఉన్నారు.

శుభాకాంక్షలు

ఉప్పల్: నగర మేయర్‌గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మేయర్ గద్వాల విజయలక్ష్మీని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్లు తినిపించారు. చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి మేయర్ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, బాలు తదితరులు ఉన్నారు.



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

గ్యాదరి బాలమల్లుకు..

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్ఐఐసీ) చైర్మన్ గ్యాదరి బాలమల్లు జన్మదినాన్ని పురస్కరించుకొని నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత టేకులపల్లి రాంచందర్ సోమవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అల్వాల్: గ్రేటర్ మేయర్‌గా పదవి బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మేయర్ జి.విజయలక్ష్మీని మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు.



అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్లు జితేంద్రనాథ్, ప్రేమ్‌కుమార్



బాలమల్లుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాంచందర్

యువతి పెళ్లికి ఆర్థిక సాయం



యువతికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ నవోదయనగర్‌కు చెందిన నాగేష్, అండాలు దంపతుల కూతురు ఉపేంద్ర పెళ్లి సందర్భంగా బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి సోమవారం యువతికి ఆర్థిక సాయం అందజేశారు. బీఎల్ఆర్ ట్రస్టు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగానే ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రమేశ్, నవీన్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

భళా.. శిల్పకళా

లయోలా అకాడమిలో ఆకట్టుకుంటున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో శిల్పకళ సౌందర్యం

అల్వాల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని లయోలా కళాశాల ప్రిన్సిపల్ ఎల్.జోజిరెడ్డి అన్నారు. డిగ్రీ, పీజీ కళాశాల మల్టీమీడియా, యానిమేషన్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్ర, శిల్పకళా ప్రదర్శన రెండు రోజుల పాటు అల్వాల్ లయోలా కళాశాలలో నిర్వహిస్తున్నారు. ప్రదర్శనను సోమవారం ప్రారంభించిన ప్రిన్సిపల్ జోజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఊహలకు రూపకల్పన చేసి శిల్పాలను తయారు చేశారన్నారు. ప్రదర్శనను తిలకించడానికి పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. కరస్పాండెంట్ అమర్‌రావు, రత్నవని, అరుల్‌జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ జోజిరెడ్డి

వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఓల్డ్ అల్వాల్‌లో నివాసముండే గంగుల శ్రీకాంత్(28) బజాజ్ సర్వీస్ సెంటర్‌లో క్యాషియర్. ఆదివారం రాత్రి అల్వాల్ ఓయో లాడ్జీ రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివాహితతో వివాహేతర సంబంధంతో ఏర్పడిన సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం



గౌతంనగర్: దయానంద్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కే.హన్మంతరావు, భానురేఖ, సుజాత, అశోక్, రాందాస్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



మల్కాజిగిరి: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఇందిరా నెహ్రూనగర్‌లో అపస్మారక స్థితిలో యువకుడు(30) పడిఉన్నాడని సమాచారం అందుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవం



మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవంలో నేతలు

బోడుప్పల్: శ్రీభ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తోటకూర రవీందర్‌యాదవ్, రేణుక దంపతులచే రేణుక ఎల్లమ్మవారి కల్యాణం మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తోటకూర చందర్‌యాదవ్, తోటకూర రవీందర్‌యాదవ్, కొత్త కిశోర్‌గౌడ్, తోటకూర మల్లేష్, తోటకూర విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కుట్టుమిషన్ల పంపిణీలో బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్‌లో సోమవారం ప్రొఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహిళలకు విద్య, వైద్యపరంగా ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానన్నారు. ఎంబీబీఎస్‌లో ఫ్రీసీటు సాధించిన మహిళలకు తాను పూర్తి ఫీజు చెల్లిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెషన్ డైరెక్టర్ ఉష, ఎస్సీ కార్పొరేషన్ అధికారి యుగేందర్, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు భైరి నవీన్‌గౌడ్, ఇంద్రయ్య, బీఆర్ఎస్ నేతలు నర్సింహారెడ్డి, సుచిత్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి



అల్వాల్ కమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: కార్మికులను మోసం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న వీధి దీపాల నిర్వాహణ కార్మికులకు జీతాల చెల్లింపులో కాంట్రాక్టర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ సోమవారం అల్వాల్ సర్కిల్ కమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. ప్రతి ఉద్యోగికి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో జీతాల్లో కోత పెడుతూ సదరు సంస్థకు చెల్లించకపోగా ఈ విషయమై కార్మికులు కాంట్రాక్టర్‌ను అడిగితే ఉద్యోగాలు తొలగిస్తున్నారన్నారు. తక్కువ సిబ్బందితో పనిచేయిస్తూ పనిభారం పెంచుతున్నారన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని ఉపకమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, క్రిష్ణారెడ్డి, గోపి, శేఖర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, లావణ్య, కార్తీక్‌గౌడ్, ఎం.శ్రీనివాస్, అనిల్, నాగరాజు, ఆనంద్, రాజేష్, రాంసింగ్ తదితరులు ఉన్నారు.

డివిజన్లలో ఎక్కడి సమస్యలు అక్కడే..



ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారితో సమస్యలపై చర్చిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉప్పల్ సర్కిల్ ఏ- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: అన్ని డివిజన్లలో సమస్యలు తాండవం చేస్తున్నాయని, జోడో యాత్రలో బయట పడ్డాయని ఉప్పల్ సర్కిల్ ఏ- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ, నాచారం డివిజన్లలో స్థానికులు సమస్యలతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికిన నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. జోడో యాత్రలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉప్పల్ సర్కిల్ ఏ- బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ఉప్పల్ డీసీ అరుణ కుమారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య మొదలుకొని డ్రైనేజీ, కలుషిత నీటి సరఫరా, పాడైన రోడ్లు, నోళ్లు తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ ఇలా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని, స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జలమండలి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. టీపీసీసీ ప్రతినిధి మేకల శివారెడ్డి, బ్లాక్ జనరల్ సెక్రటరీ సుర్వీ మురళిగౌడ్, సంయుక్త కార్యదర్శి ఎండీ షఫీ, కొంపల్లి బాలరాజు, ఆకారపు అరుణ్, తవిడబోయిన గిరిబాబు, ఈగ అంజయ్య, శేఖర్‌రెడ్డి, భాస్కర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



చర్లపల్లి పారిశ్రామికవాడలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీఎస్ఐఐసీ జోనల్ కమిషనర్ మాధవి

కుషాయిగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఐఐసీ జోనల్ కమిషనర్ మాధవి అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఐలా చైర్మన్ రోషిరెడ్డి, ఐలా కమిషనర్ ఉమామహేశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సౌలభ్యం కోసమే కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి, ఐలా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, హనుమాన్ ప్రసాద్, రఘు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో 'ప్రజాగోస - బీజేపీ భరోసా'

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్‌లో సోమవారం పలు బూత్ అధ్యక్షులు, గణేష్‌నగర్, భరత్‌నగర్, నెహ్రూనగర్, మొగల్ కాలనీవాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ మాట్లాడుతూ మౌలాలి ప్రధాన రోడ్డు మార్గం మరమ్మతులను త్వరలో పూర్తిచేసేలా కృషి చేస్తానన్నారు. కాలనీ ప్రధాన మార్గంలో బస్సు సౌకర్యం ప్రారంభించాలని కోరుతూ కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, మల్కాజిగిరి సర్కిల్ ఓబీసీ కో-కన్వీనర్ కిరణ్, డివిజన్ అధ్యక్షుడు సాయిబాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, శివగౌడ్, వెంకటేష్‌నేత, నటరాజ్, చింతల శేఖర్, రాము ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



నరేంద్ర(ఫైల్)

ఉప్పల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పల్ సాయిరాంనగర్ ప్రాంతానికి చెందిన డి.నరేంద్ర(51) ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.